క్లుప్తంగా

నేడు మంత్రి రాక

ఎల్కతుర్తి: భీమదేవరపల్లి మండలం కొత్తకొండ వీరభద్రస్వామి ఆలయంలో గురువారం నిర్వహించే సమావేశానికి రాష్ట్ర రోడ్డు రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ హాజరు కానున్నారు. ఈనె 14వ తేదీ నుంచి ప్రారంభం కానున్న కొత్తకొండ వీరభద్రస్వామి జాతర ఏర్పాట్లపై అధికారులతో సమావేశం నిర్వహించనున్నట్లు ఆలయ సీఓ కిషన్‌రావు బుధవారం ప్రకటనలో పేర్కొన్నారు.

కాంగ్రెస్‌ను విమర్శించడం సరికాదు



ఆత్మకూరు : కాంగ్రెస్ పార్టీని విమర్శించడం మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డికి తగదని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు కమలాపురం రమేష్ అన్నారు. మండల కేంద్రంలో బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. పేదల సంక్షేమం కోసమే కాంగ్రెస్ పార్టీ పని చేస్తుందన్నారు. బీఆర్ఎస్ పార్టీ గృహలక్ష్మి పథకంను ఓటుబ్యాంకుగా వాడుకునేందుకు ప్రయత్నించిందని, కానీ కాంగ్రెస్ ప్రభుత్వం నిజమైన పేదలకు ప్రభుత్వ పథకాలను అమలు చేస్తుందన్నారు. మాజీ ఎమ్మెల్యే ధర్మారెడ్డి విమర్శలు మానుకొని ప్రతిపక్ష పాత్ర పోశించాలని హితవు పలికారు. ఎంపీపీ సుమలత, జెడ్పీటీసీ రాధిక, వర్కింగ్ ప్రెసిడెంట్ వాసు, సొసైటీ చైర్మన్ రవీందర్‌గౌడ్, సర్పంచులు రాజు, రవికుమార్, నాయకులు కుమారస్వామి, రవి, సాంబయ్య పాల్గొన్నారు.

వాలీబాల్ కిట్ అందజేత



శాయంపేట : మండలంలోని పెద్దకోడెపాక గ్రామానికి చెందిన క్రీడాకారులకు ఎస్ఎఫ్ఐ నాయకులు వాలీబాల్ కిట్లను బుధవారం అందించారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ హనుమకొండ జిల్లా ప్రధాన కార్యదర్శి మంద శ్రీకాంత్ మాట్లాడారు. క్రీడాకారులను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రోత్సహించి క్రీడా రంగానికి అధిక నిధులు కేటాయించాలని కోరారు. ఈ కార్యక్రమంలో క్రీడాకారులు మంద అజయ్, కోగిల గణేష్, రేణికుంట్ల శశాంక్, యోగిరామ్, చరణ్, బిట్టు, పవన్‌కల్యాణ్, సందీప్, నవీన్, రాజ్‌కుమార్ పాల్గొన్నారు.

కానిస్టేబుల్ కుటుంబానికి చెక్కు అందజేత

మామునూరు: ఖిలా వరంగల్ మండలం మామునూరు టీఎస్‌పీఎస్పీ నాలుగో బెటాలియన్‌లో విధులు నిర్వహిస్తున్న గూడెల్లి రాజేష్ ఇటీవల అనారోగ్య సమస్యలతో మృతి చెందారు. బాధిత కుటుంబానికి రూ. 50వేల చెక్కును పరిపాలన భవనంలో కమాండెంట్ శివప్రసాద్‌రెడ్డి బుధవారం అందజేశారు. ఈ సందర్భంగా శివప్రసాద్‌రెడ్డి మాట్లాడుతూ కార్పస్ ఫండ్ ద్వారా విడుదలైన చెక్కును కానిస్టేబుల్ భార్య గౌతమికి అందజేసినట్లు వివరించారు. అలాగే హనుమకొండలోని మల్లికాంబ మనోవికాస కేంద్రాన్ని బెటాలియన్ అధికారులు, సిబ్బంది సందర్శించి మానసిక దివ్యాంగులకు పండ్లు, రూ.22 వేల నగదును అందజేశారు. కార్యక్రమంలో ఏసీ జయరాం, రాంబాబు, వేణుగోపాల్‌రెడ్డి, ఆర్ఐ చంద్రన్న, ఆర్ఎస్ఐ మనోజ్, మహేష్, సోమన్న, తదితరులు పాల్గొన్నారు.

కళాశాలకు పూర్వ విద్యార్థుల విరాళం

రామన్నపేట: వరంగల్ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో విద్యనభ్యసించిన పూర్వ విద్యార్థులు తమ కళాశాలకు విరాళం అందజేశారు. తరగతి గదుల్లో విద్యార్థులకు డ్యూయల్ బెంచీల కోసం ఈద ఇన్‌స్టిట్యూట్ ఫర్ సివిక్ లీడర్‌షిప్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో 1981 -84 బ్యాచ్‌కు చెందిన ఈద వాసుదేవారెడ్డి రూ.లక్ష బుధవారం అందించారు. అలాగే 1978 - 81వ బ్యాచ్‌కు చెందిన కట్ట మహిపాల్‌రెడ్డి రూ.25 వేలు అందించారు. ఈ సందర్భంగా విరాళాలు అందించిన దాతలను ప్రిన్సిపాల్ బైరి ప్రభాకర్, అధ్యాపకులు సన్మానించారు. కార్యక్రమంలో కళాశాల పూర్వ విద్యార్థులు టీఎస్.స్వామి, భీమ్‌రామ్, ఆనంద్‌కుమార్, నాగరాజరావు, మేకల అక్షయ్, అంజయ్య, దామోదర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఆటోడ్రైవర్ల భిక్షాటన

హన్మకొండ: రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న మహాలక్ష్మి పథకం వలన తాము ఉపాధి కోల్పోతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తూ, ఆ పథకాన్ని రద్దు చేయాలని ఆటో డ్రైవర్లు కోరారు. ఈమేరకు వేయిస్తంభాల గుడి నుంచి హనుమకొండ చౌరస్తా వరకు భిక్షాటన చేస్తూ బుధవారం నిరసన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆటోడ్రైవర్ల జేఏసీ నాయకుడు ఇసంపెల్లి సంజీవ మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన ఆరు గ్యారంటీల్లో భాగంగా అమలు చేస్తున్న మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం వలన తమ కుటుంబాలు వీధిన పడే దుస్థితి నెలకొందని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రభుత్వం ఆటోడ్రైవర్లకు జీవనభృతి కింద నెలకు రూ.15వేలు ప్రకటించి, ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు.

కమలాపూర్ : సావిత్రిబాయిపూలే చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు



దామెర : కేఎస్ఆర్ పాఠశాలలో సావిత్రిబాయి చిత్రపటానికి పూలమాల వేస్తున్న యాజమాన్యం



పరకాల : వార్డు ఆఫీసర్ శిరీషను సన్మానిస్తున్న సుభద్ర, తదితరులు



ఐనవోలు : ఎంపీపీఎస్‌లో సావిత్రిబాయి చిత్రపటానికి పూలమాల వేస్తున్న ఉపాధ్యాయులు



శాయంపేట : రక్తదాతలకు ప్రశంస పత్రం అందజేస్తున్న వైద్యులు



సావిత్రిబాయి సేవలు ఆదర్శప్రాయం

- స్త్రీలకు విద్యను పరిచయం చేసిన గొప్ప మేధావి 'పూలే'
- జిల్లా వ్యాప్తంగా జయంతి ఉత్సవాలు
- నివాళులర్పించిన ఉపాధ్యాయులు, పలువురు నాయకులు



ఆత్మకూరు : ఎంపీడీఓ కార్యాలయంలో..



నడికూడ : ప్రశంస పత్రాలతో ఉపాధ్యాయులు



ఎల్కతుర్తి : సావిత్రిబాయి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న నాయకులు

ఎల్కతుర్తి: మొట్టమొదటి మహిళా ఉపాధ్యాయురాలు సావిత్రిబాయి పూలేను నేటి తరం యువత ఆదర్శంగా తీసుకోవాలని పలువురు నాయకులు సూచించారు. ఆమె 193వ జయంతిని బుధవారం భీమదేవరపల్లి, ఎల్కతుర్తి మండల కేంద్రంలో పలు సంఘాల నాయకులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సావిత్రిబాయి పూలే చిత్రపటానికి పూల మాల వేసి నివాళులర్పించారు. అనంతరం ప్రయాణికులకు స్వీట్లు, పండ్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ.. సావిత్రిబాయి పూలే స్త్రీ జాతికి విద్యనందించిన తొలి మహిళా ఉపాధ్యాయురాలుగా పేరుగాంచిందని అన్నారు. ఆమెను ఆదర్శంగా తీసుకొని యువతి, యువకులు ఉన్నత చదువులు చదివి సమాజానికి సేవలందించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో నాయకులు శనిగరం వెంకటేష్, మేకల సంపత్, రమేష్, వెంకన్న, భిక్షపతి, రాజ్‌కుమార్, చంద్రమౌళి, కుమాస్వామి పాల్గొన్నారు.

ఆత్మకూరులో..

ఆత్మకూరు : మండల కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ మార్క సుమలత ఆధ్వర్యంలో, బస్‌స్టేషన్ వద్ద అంబేడ్కర్ విద్యావంతుల వేదిక ఆధ్వర్యంలో బుధవారం సావిత్రిబాయి పూలే జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. పూల మాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో పెరుమాండ్ల శ్రీనివాస్, వరుణ్‌గాంధీ, సాగర్, సొసైటీ చైర్మన్ రవీందర్‌గౌడ్ పాల్గొన్నారు.

నడికూడలో..

నడికూడ : మండల కేంద్రంలోని ఉన్నత పాఠశాలలో పీఆర్టీయూ ఆధ్వర్యంలో సావిత్రిబాయిపూలే జయంతి వేడుకలు గురువారం ఘనంగా నిర్వహించారు. చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. మహిళా ఉపాధ్యాయులను సన్మానించారు.

శాయంపేటలో..

శాయంపేట : మొట్టమొదటి మహిళా ఉపాధ్యాయురాలు సావిత్రిబాయి పూలే జయంతిని బుధవారం మండల కేంద్రంలోని సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల పాఠశాల, మహాత్మా జ్యోతిభాపూలే వెనుకబడిన తరగతుల బాలుర గురుకుల పాఠశాలలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా పాఠశాలల ప్రిన్సిపాళ్లు సుభాషిణిదేవి, మోతే రాజ్‌కుమార్ పూలే చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. సావిత్రిబాయిపూలే గొప్పతనాన్ని, బాలికల విద్య కోసం ఆమె చేసిన కృషిని వివరించారు. అలాగే మండల కేంద్రంలోని ప్రధాన చౌరస్తాలో బీసీ రాజ్యాధికార సమితి రాష్ట్ర నాయకుడు, తెలంగాణ ఉద్యమకారుడు దామెరకొండ కొమురయ్య ఆధ్వర్యంలో జయంతిని నిర్వహించి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో నాయకులు మారెపల్లి రాజు, మస్కే సదయ్య, ఉప్పు నర్సయ్య పాల్గొన్నారు.

రక్తదానం..

రక్తదానం ప్రాణదానంతో సమానమని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ సాయికృష్ణ అన్నారు. చదువుల తల్లి సావిత్రిబాయి పూలే 193వ జయంతిని పురస్కరించుకొని బుధవారం మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఏబీఎస్ఎఫ్, అంబేడ్కర్ యువజన సంఘం ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. 30మంది యువకులు రక్తదానం చేయగా డాక్టర్ సాయికృష్ణ, డాక్టర్ వినయ్ ప్రశంస పత్రాలు అందించారు. ఈ సందర్భంగా ఏబీఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు నాగుల పవన్‌కల్యాణ్ మాట్లాడుతూ.. సావిత్రిబాయి పూలే మహిళల అభ్యున్నతి కోసం చేసిన సేవలను కొనియాడారు. మహిళల కోసం పాఠశాలను స్థాపించిన గొప్ప మేధావి సావిత్రిబాయిపూలే అన్నారు. ఆమె కృషిని గుర్తించి ఉపాధ్యాయ దినోత్సవంగా ప్రభుత్వం అధికారికంగా నిర్వహించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు మొగ్గం సుమన్, ఏబీఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి నాలికె ప్రతాప్, అంబేడ్కర్ యువజన సంఘం అధ్యక్షుడు కొంగరి విజయ్‌ప్రకాశ్, కార్యదర్శి శివ, సన్ని, వికాస్, బిట్టు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

కమలాపూర్‌లో..

కమలాపూర్ : మండల కేంద్రంలోని మహాత్మా జ్యోతిభాపూలే బీసీ సంక్షేమ బాలుర గురుకుల పాఠశాలలో సావిత్రి బాయి పూలే జయంతిని బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రిన్సిపాల్ మల్లయ్య, ఉపాధ్యాయులు సావిత్రిబాయిపూలే చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ కె.రవి, విజయ్‌కుమార్, జి.రజిత, ఉపాధ్యాయులు నాగరాజు, సతీష్, అశోక్, దీప, మమత, స్రవంతి పాల్గొన్నారు.

దామెరలో..

దామెర: మండలంలోని కోగిల్వాయి ప్రభుత్వ పాఠశాలలో సావిత్రిబాయి పూలే జయంతిని బుధవారం ఘనంగా నిర్వహించారు. సావిత్రిబాయి పూలే చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం మహిళా టీచర్లను ఘనంగా సన్మానించారు. ఊరుగొండ శివాలోని కేఎస్ఆర్ పాఠశాలలో సావిత్రిబాయి పూలే చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ కాశెట్టి శ్రీధర్, ప్రిన్సిపల్ చాగంటి క్రాంతికుమార్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పరకాలలో..

పరకాల : తొలి మహిళా ఉపాధ్యాయురాలు సావిత్రిబాయి పూలే 193వ జయంతి ఉత్సవాలు పట్టణంలో బుధవారం ఘనంగా జరిగాయి. అంబేడ్కర్ భవన్‌లో స్వేరో ఇంటర్నేషనల్ రాష్ట్ర ఉపాధ్యక్షురాలు అమ్మఒడి సుభద్ర శ్యామల సావిత్రిబాయి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అంగన్‌వాడీ టీచర్లు, ఉపాధ్యాయులు, మెప్మా సిబ్బంది, ఆశా కార్యకర్తలు నివాళులర్పించారు. అనంతరం వార్డు ఆఫీసర్ కంది శిరీషను శాలువాతో సన్మానించారు. టీచర్లు పాల్గొన్నారు.

ఐనవోలులో..

ఐనవోలు : మానవతావాది, సంఘ సంస్కర్త, స్త్రీల హక్కుల పోరాట యోధురాలు, తొలి మహిళా ఉపాధ్యాయురాలు సావిత్రిబాయి పూలే అని ఉడుతగూడెం ఎంపీపీఎస్ హెచ్ఎంలు శ్రీనివాస్‌రెడ్డి, చుంచుకాల లింగారావు అన్నారు. మండలంలోని పలు పాఠశాలల్లో బుధవారం సావిత్రిబాయి పూలే 193వ జయంతిని ఘనంగా నిర్వహించారు. ఆమె చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ప్రస్తుతం స్త్రీలు అనుభవిస్తున్న అన్ని హక్కులకు ఆద్యురాలు సావిత్రిబాయేనని ప్రశంసించారు. మండల కేంద్రంలోని నంది సెంటర్‌లో నిర్వహించిన కార్యక్రమంలో సావిత్రిబాయి ఆశయ సాధనకు ప్రతిఒక్కరూ పాటుపడాలని సామాజిక కార్యకర్త రాజుయాదవ్ అన్నారు. నాయకులు సారంగపాణి, నర్సయ్య, రాజు, ఎల్లాగౌడ్, శ్రీకాంత్, రమేష్, మల్లేశం, సాంబయ్య, సుధాకర్ ఉపాధ్యాయులు శ్రీనివాసరెడ్డి, మహేందర్‌రెడ్డి, ల క్ష్మయ్య, మహేందర్, సీఆర్పీ రేవతి పాల్గొన్నారు.

'గృహలక్ష్మి' లబ్ధిదారులకు న్యాయం చేయాలి

- మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి

ఆత్మకూరు : నిరుపేదల సొంతింటి కల నేరవేర్చేందుకు గతంలో అధికారంలో ఉన్న బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన గృహలక్ష్మి పథకంలో ఎంపిక చేసిన లబ్ధిదారులను ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం అభయహస్తం పథకం, ఇందిరమ్మ ఇళ్ల జాబితాలో చేర్చి న్యాయం చేయాలని పరకాల గ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మండల కేంద్రంలో బుధవారం విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. గృహలక్ష్మి పథకంలో మంజూరై నిర్మాణంలో ఉన్న ఇళ్లకు ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల జాబితాలో చేర్చి బిల్లులు చెల్లించాలని కోరారు. పార్టీలకు అతీతంగా జిల్లా కలెక్టర్లు, అధికారులు ప్రత్యక్షంగా లబ్ధిదారులను ఎంపిక చేసి ఇళ్ల నిర్మాణ పనులు ప్రారంభం చేసిన వారికి మంజూరు పత్రాలు అందజేయడం జరిగిందన్నారు. లబ్ధిదారులు ఉన్న ఇళ్లను కూల్చేసి, అప్పులు చేసి నూతన ఇళ్ల నిర్మాణాలు చేపట్టారని ప్రస్తుతం వారి ఇళ్లు రద్దు చేయడం సరికాదన్నారు. ఈ విషయంలో సీఎం రేవంత్‌రెడ్డి, ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి పునరాలోచన చేయాలని కోరారు. లబ్ధిదారులకు అన్యాయం చేస్తే వారి తరుపున పోరాటం చేస్తామని హెచ్చరించారు. తెలంగాణ రాష్ట్రంలో పరకాల నియోజకవర్గంలోనే గృహలక్ష్మి పథకంలో ఇళ్ల నిర్మాణాలు ఎక్కువగా జరిగాయని అన్నారు. అధికారులు పునఃపరిశీలన చేసి లబ్ధిదారులకు బిల్లులు మంజూరు చేయాలన్నారు. ఈ సమావేశంలో ఆ పార్టీ నాయకులు కుమారస్వామి, కేశవరెడ్డి, సుధాకర్‌రెడ్డి, రవీందర్, ప్రవీణ్‌రెడ్డి, సాగర్, అంకూస్, రాము, సుధాకర్, మనోహర్, భిక్షపతి, వేణు తదితరులు పాల్గొన్నారు.

వసూలు చేసిన డబ్బులు తిరిగివ్వాలి



సమావేశంలో మాట్లాడుతున్న రాజేశ్వర్‌రెడ్డి

వేలేరు : బీఆర్ఎస్ పార్టీ అధికారంలో ఉన్న సమయంలో వివిధ సంక్షేమ పథకాలు అమలు చేయిస్తామని ఆ పార్టీకి చెందిన కొందరు నాయకులు లబ్ధిదారుల నుంచి వసూలు చేసిన డబ్బులు తిరిగివ్వాలని కాంగ్రెస్ పార్టీ మండల ఇన్‌చార్జ్ మల్కిరెడ్డి రాజేశ్వర్‌రెడ్డి డిమాండ్ చేశారు. మండలంలోని కమ్మరిపేట గ్రామంలో బుధవారం ఆయన విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడారు. వివిధ గ్రామాల్లోని పేద, మధ్యతరగతి ప్రజలు సంక్షేమ పథకాల్లో తమను లబ్ధిదారులుగా ఎంపిక చేయాలని కొంతమంది బీఆర్ఎస్ నాయకులకు డబ్బులను అధిక వడ్డీలకు తీసుకొచ్చి ఇచ్చారని అన్నారు. ఇప్పుడు డబ్బులు ఇచ్చిన పేదలు వెళ్లి తమ డబ్బులు తమకు ఇవ్వాలని అడుగుతుంటే వారు రేపు, మాపు అంటూ కాలయాపన చేస్తున్నారని తెలిపారు. డబ్బులు వసూలు చేసిన వ్యక్తులు ఎవరి డబ్బులు వారికి తిరిగివ్వాలని, లేని పక్షంలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో చర్యలు తీసుకునేందుకే వెనుకాడబోమని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ రాజమల్లయ్య, గ్రామశాఖ అధ్యక్షుడు రమేష్, ఎస్సీ సెల్ మండల అధ్యక్షుడు సంపత్ తదితరులు పాల్గొన్నారు.

ఇంటింటా శ్రీరాముడి అక్షింతల అందజేత



ఎల్కతుర్తి : అంక్షింతలు పంపిణీ చేస్తున్న నాయకులు



కమలాపూర్ : అక్షింతలు పంపిణీ చేస్తున్న భక్తులు

ఎల్కతుర్తి: మండలంలోని చింతలపల్లి గ్రామంలో బుధవారం ఇంటింటికీ అయోధ్య రాముడి అంక్షింతలు పంపిణీ చేశారు. ఈ నెల 22వ తేదీన అయోధ్యలో సీతారాముల విగ్రహ ప్రతిష్ఠాపన ఉత్సవాలు జరుగనున్న నేపథ్యంలో దేవాదాయ శాఖవారు రాముల వారి అక్షింతలు ఇంటింటికీ చేరే విధంగా చర్యలు చేపట్టారు. అలాగే బీజేపీ నాయకులు కూడా ఇంటింటికీ అక్షింతలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు కుడితాటి చిరంజీవి, సర్పంచ్ కడితాటి అనీతరాజు, నర్సింగారావు, రవీందర్, ఇరువాల సతీష్, గోపికృష్ణ, సారంగం, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

కమలాపూర్ : అయోధ్య శ్రీరామ జన్మభూమి మందిరంలో ఈ నెల 22వ తేదీన జరిగే శ్రీరాముని ప్రాణ ప్రతిష్ఠా మహోత్సవంలో భాగంగా అయోధ్య రాముని ఆశీర్వచ అక్షింతలు బుధవారం మండల కేంద్రంలో పంపిణీ చేశారు. శ్రీరామ భక్తులు, అయ్యప్ప మాలాధారులతో కలిసి డప్పు చప్పుళ్లతో ఇంటింటికి తిరుగుతూ అయోధ్య శ్రీరామ మందిర అక్షింతలు అందించారు. సర్పంచ్ కట్కూరి విజయ తిరుపతిరెడ్డి, ప్రగతి యూత్ వ్యవస్థాపక అధ్యక్షుడు సతీష్, అధ్యక్షుడు మండ చరణ్, శ్రీరామ భక్తులు వెంగళ సాయి, మునీందర్, సాంబయ్య, సహదేవ్, అయ్యప్ప గురుస్వామి ఇందుర్తి జానకి రామారావు, అయ్యప్ప భక్తులు నేరెళ్ల అశోక్, అపరాధి సుధాకర్, ఎండపెల్లి మల్లారెడ్డి, భక్తులు పాల్గొన్నారు.

ముమ్మరంగా కొనసాగుతున్న 'ప్రజాపాలన'



ఎల్కతుర్తి : దరఖాస్తులు పరిశీలిస్తున్న డీఆర్‌డీఓ



ఆత్మకూరు : దరఖాస్తులు స్వీకరిస్తున్న అధికారులు



కమలాపూర్ : దరఖాస్తులు స్వీకరిస్తున్న అధికారులు

ఎల్కతుర్తి: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన అభయహస్తం ఆరు గ్యారంటీ పథకాల అమలు కోసం చేపట్టిన ప్రజాపాలన కార్యక్రమం బుధవారం ఎల్కతుర్తి మండలంలోని దండేపల్లి ,పెంచికలపేట, వీరనారాయణపూర్ గ్రామాల్లో కొనసాగింది. ఈ సందర్భంగా ప్రజలు నుంచి వచ్చిన దరఖాస్తులను అధికారులు స్వీకరించారు. అలాగే భీమదేవరపల్లి మండలంలోని ముత్తారం, వీర్లగడ్డతండా, ముస్తఫాపూర్, వంగర గ్రామాల్లో ప్రజలు దరఖాస్తులు సమర్పించగా అధికారులు స్వీకరించారు. డీఆర్‌డీఓ శ్రీనివాస్‌కుమార్ రెండు మండలాలను సందర్శించి దరఖాస్తులను స్వీకరించారు. ఈ కార్యక్రమాల్లో తహసీల్దార్ జగత్‌సింగ్, వెంకటభాస్కర్, ఎంపీడీఓలు తూర్పాటి సునీత, భాస్కర్, ఏపీఎం రవీందర్, ఏపీఓ అనిత, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ సుభాష్‌రెడ్డి, ఏఈ లక్ష్మణ్‌నాయక్, ఏఓ అబ్జల్‌పాషా, రాజ్‌కుమార్, ఏఈఓలు రాజు, తిరుపతితో పాటు పలు శాఖల అధికారులు, పంచాయతీ కార్యదర్శులు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

ఆత్మకూరు : మండలంలో ప్రజాపాలన కార్యక్రమం కొనసాగుతోంది. బుధవారం మండలంలోని పెద్దాపూర్, అక్కంపేట గ్రామాల్లో సభలు నిర్వహించి అధికారులు దరఖాస్తులు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ సుమలత, ఎంపీడీఓ శ్రీనివాస్‌రెడ్డి, ఏపీఓ రాజిరెడ్డి, అధికారులు పాల్గొన్నారు.

ధర్మసాగర్ : ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు పొందేందుకు అర్హులందరూ దరఖాస్తు చేసుకోవాలని తహసీల్దార్ సదానందం అన్నారు. దరఖాస్తుతో పాటు రేషన్ కార్డు, ఆధార్‌కార్డు, గ్యాస్‌బుక్కు, విద్యుత్ బిల్లు, ఉపాధి హామీ పథకం జాబ్‌కార్డు జిరాక్స్ కాపీలను జత చేసి ఇవ్వాలని ఈ సందర్భంగా ఆయన సూచించారు.

కమలాపూర్ : మండలంలోని శంభునిపల్లి, కానిపర్తి గ్రామాల్లో ప్రజాపాలన గ్రామ సభలు బుధవారం కొనసాగాయి. మహాలక్ష్మి, రైతు భరోసా, చేయూత, గృహజ్యోతి, ఇందిరమ్మ ఇళ్లకు సంబంధించి ప్రజల నుంచి దరఖాస్తులు స్వీకరించారు. ఐదోరోజు రెండు గ్రామాల్లో కలిపి మొత్తం 3,923 దరఖాస్తులు స్వీకరించినట్లు అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ గుండె బాబు, తహసీల్దార్ పి.మాధవి, ఎంపీఓ విమల, ఏఓ లక్ష్మారెడ్డి, ఏపీఎం నారాయణ, సర్పంచులు పెండ్యాల రవీందర్‌రెడ్డి, మాట్ల రవీందర్, ఎంపీటీసీ పసరగొండ శైలజనాగేందర్, ఉపసర్పంచ్ దబ్బెట అశోక్, పీఏసీఎస్ డైరెక్టర్ భావని రాజేశ్వర్‌రావు, పల్లె దవాఖాన వైద్యాధికారులు, వైద్య సిబ్బంది, పంచాయతీ కార్యదర్శులు, పలు శాఖల అధికారులు, ప్రజలు పాల్గొన్నారు.

వేలేరు : మండలంలోని గుండ్లసాగర్ గ్రామంలో జరిగిన గ్రామసభలో ఎంపీపీ కేశిరెడ్డి సమ్మిరెడ్డి పాల్గొన్నారు. ఆరు గ్యారంటీ పథకాల కోసం స్వీకరించే దరఖాస్తుల్లో అనేక అనుమానాలు ఉన్నాయని, వాటిని ఏవిధంగా అమలు చేస్తారో ప్రజలకు నివృత్తి చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. జెడ్పీసీఈఓ వెంకటేశ్వరరావు, తహసీల్దార్ కోమి, ఎంపీడీఓ లక్ష్మీప్రసన్న పాల్గొన్నారు.

శాయంపేట : మండలంలోని శాయంపేట, తహరాపూర్, సూరంపేట గ్రామాల్లో నిర్వహించిన ప్రజాపాలన కార్యక్రమంలో మండల స్పెషల్ ఆఫీసర్ హరిప్రసాద్ పాల్గొని దరఖాస్తులు స్వీకరించారు. దరఖాస్తు చేసుకునే విధానంపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఒకే దరఖాస్తులో ఐదు పథకాలకు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ సుభాషిణి, ఎంపీఓ రంజిత్‌కుమార్, ఏఓ గంగాజమున, విద్యుత్‌శాఖ ఏఈ రాజకుమార్, ఆర్ఐ శరత్‌కుమార్ ఐసీడీఎస్ సూపర్‌వైజర్ సునిత, ఏపీఎం శ్రీధర్‌రెడ్డి పాల్గొన్నారు.

కార్యకర్తలకు అండగా ఉంటా



పరకాల: అధికారంలో లేకపోయినా కార్యకర్తలకు, వారి కుటుంబాలకు అండగా ఉంటూ ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని మాజీ ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి అన్నారు. మాతృమూర్తులను కోల్పోయిన పట్టణానికి చెందిన బీఆర్ఎస్ నాయకులు బట్టు రవి, మేకల రవిను ఆయన బుధవారం పరామర్శించారు. మృతుల చిత్రపటాలకు మాజీ ఎమ్మెల్యే నివాళులర్పించారు.

కేవీకే శాస్త్రవేత్తల క్షేత్ర సందర్శన



మిర్చితోటను పరిశీలిస్తున్న డాక్టర్ రాజు

ఐనవోలు : కృషి విజ్ఞాన కేంద్రం మామునూరు వ్యవసాయ శాస్త్రవేత్తలు బుధవారం ఒంటిమామిడిపల్లి గ్రామంలో పర్యటించి వేరుశనగ, మిరప వివిధ పంటలను సందర్శించారు. ఈ సందర్భంగా సస్యరక్షణ శాస్త్రవేత్త డాక్టర్ రాజు వేరుశనగ పంటలో తిక్క ఆకుమచ్చ తెగులు ఉధృతిని గుర్తించారు. దీని నివారణకు కిలో విత్తనానికి టెబ్యూకొనజోల్ అనే మందును కలుపుకుని విత్తన శుద్ధి చేసుకోవాలని, అలాగే క్లోరతలోనిల్ అనే మందును పిచికారీ చేయాలని సూచించారు. కార్యక్రమంలో పలువురు రైతులకు లింగాకర్షక బుట్టలు, ట్రైకోడర్మా జీవ శిలింద్రం, వేప నూనెను పంపిణీ చేశారు. మిర్చిలో కాయకుళ్లను గమనించిన ఆయన నీటి తడులు తగ్గించాలన్నారు. సస్యరక్షణ కోసం అజాక్సీ స్ట్రోబిన్, టెబుకొనజోల్ మందులను తగు మోతాదులో పిచికారి చేయాలని సూచించారు. రైతులు వ్యవసాయశాఖ అధికారుల సలహాలు, సూచనలు పాటించాలని ఈ సందర్భంగా ఆయన కోరారు. అధిక దిగుబడులు పొందవచ్చని అన్నారు.

ఆలయ అభివృద్ధికి కృషి



వేలేరు : మండలంలోని ఎర్రబెల్లి గ్రామంలో గల హనుమాన్ ఆలయ అభివృద్ధికి కృషి చేస్తానని రిటైర్డ్ ఆంధ్రా బ్యాంకు మేనేజర్ బాదవత్ వీరస్వామి తెలిపారు. బుధవారం ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. గతంలో రూ.20లక్షల స్వంత ఖర్చులతో ఆలయాన్ని నిర్మించినట్లు తెలిపారు. త్వరలోనే ఆలయ ప్రాగణంలో సీసీతో పాటు మరింత అభివృద్ధి చేసేందుకు దాతలు ముందుకు వచ్చినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో వ్యాపారులు ఎడవెల్లి మాధవరెడ్డి, దొడ్డ ఈశ్వరయ్య పాల్గొన్నారు.